# జ్ఞాపకాల పుటల్లో బుక్‌మార్క్స్

- కాశీనాథుని రాధ

ఇండియాలో వుండగా మొదటి ఆట సినిమాకెళ్ళొస్తే నిద్ర సరిపోక పొద్దుట అలసటగా అనిపించేది. మరి ఈ అమెరికా జీవితానికి అలవాటు పడ్డాక రాత్రి ఎంత పొద్దు పోయి పడుకున్నా తెల్లారి లేచి అతి మామూలుగా పనులు చేసుకోవడం అలవాటై పోయింది. రాత్రి పన్నెండింటికి పక్కెక్కిన నాకు తెల్లవారుజామున ఫోన్ మోతకి తెలివి వచ్చింది. కాస్త ఫోను అందుకుంటారా అన్నా మా వారిని కుదుపుతూ... ఈయన లేచి అందుకునేటప్పటికి అవతలి వాళ్ళు హాంగ్ అప్ చేస్తారేమో నని నేనే అందుకున్నా. అవతలి వైపు నుంచి మా అక్కయ్య హల్లో... హల్లో... అంటోంది కాస్త కంగారుగా. "పెదమావయ్య పోయారే... అమ్మలూ!..." నేను మాత్రం ఎందుకో ఇదంతా నిజం కాదని, ఆ విషయం కొంతసేపటికి నాకే తెలిసొస్తుందన్నట్టు ఏం అనకుండా ఫోన్ పట్టుకుని ఉండిపోయాను." ఏవే అమ్మలూ! వినబడుతోందా? ఇంకా ఫోన్ మీదే వున్నావా?" అంటూ కంగారు పడుతోంది మా అక్కయ్య. ...

"ఆ... వినబడుతోంది." అన్నాను వినీవినబడకుండా.

"నిన్నరాత్రి హార్ట్ అటాక్ వచ్చి కాకినాడ హాస్పిటల్లో పోయారని విశాల ఫోన్ చేసి చెప్పింది. నీకు తెలీదేమోనని చెబుతున్నా, ఇంక ఎవరినీ ముట్టుకోకుండా తలమించి స్నానంచేసి కట్టుకున్న బట్టలు తడిపి ఆరేసుకో" అంది.

కొద్ది క్షణాల ఆగి నానుంచి ఏ రెస్పాన్స్ రాకపోవడంతో "జాగ్రత్త మళ్ళీ ఫోన్ చేస్తా మరి" అంటూ ఫోన్ పెట్టేసింది మా అక్కయ్య. తను చెప్పినట్టుగానే స్నానం చేసి తడిబట్టలు డ్రైయర్‌లో పడెయ్యడానికి కిందకి వెళ్ళేను. మనసంతా స్తబ్ధుగా వుంది. కళ్ళమ్మట కొంచం నీళ్ళు వస్తున్నాయి గాని. పెద్దగా ఏడుపు రావడం లేదు. నన్ను చూసి నాకే వింతగా తోచింది. పెద మావయ్య ఈ లోకం వదలి వెళ్ళిపోయారు. ఇంక ఎప్పుడు మావయ్యని చూడడం అనేది జరగదు అన్న నిజం లోలోపల నాకు నచ్చని విషయం కావడం వల్ల దాన్ని గురించి ఆలోచించడమే నామనసుకి యిష్టంలేకో, లేకపోతే ఆలోచించకపోవడంలోనే ఉపశమనం ఉందనుకుంటోందో నాకేమీ అంతుపట్టటంలేదు.

ఈ లోపున ఈయన లేచి వర్క్‌కి వెళ్ళడానికి సిద్ధం అయి కిందకి వచ్చారు. ఎవరు ఫోన్ చేసారు అంటూ... మా పెదమావయ్య పోయారట మా అక్కయ్య ఫోన్ చేసింది. "అయ్యో!... ఆర్ యు ఒకె" అన్నారు. "దట్స్ వాట్ ఈజ్ పజ్‌లింగ్ మీ" చిన్నప్పుడు నేనే వాళ్ళ లోకం అన్నట్లు వుండేవారు మావయ్య, పిన్ని. అలాంటి మావయ్య పోయారంటే నాకు రావలసినంత పెద్దగా దుఖం రావటంలేదే... నేను ఇంత కఠినమైన మనిషిని అనే విషయాన్ని ఒప్పుకోవడం కష్టంగా వుంది.

"మీకేవనిపిస్తుంది నన్ను చూస్తే? నా జీవితం, నా ఇల్లూ, నా పిల్లలు, భర్త అంటూ నా గొడవల్లో నేనుండి... నన్ను ఎంతో ప్రేమగా పెంచిన వాళ్ళందరిని మర్చిపోయానా?" అన్నా.

"నేనేం పెద్ద వేదాంతిని కాను. కాని, జీవితం అంటే అంతే మరి. రోజూ కొత్త పరిచయాలు, కొత్త బంధువులు, పరిస్థితులు, తటస్థ పడుతూనే వుంటాయి. జీవితం చైతన్య ప్రవంతి. నిత్యం మారటమే దాని ధర్మం. కొత్త వచ్చిందని పాతని పూర్తిగా వదిలెయ్యం గాని. వర్తమానంలో వున్న వాటికి ఇమ్మీడియెట్



Telugu Jyothi Special Issue April 08

అటెన్షన్ ఇస్తాము. ఇదేం చెడ్డతనం కాదు. పిచ్చిపిచ్చి ఆలోచనలు మానేసి ఇవాల్టికి వర్క్ మానేసి టేక్ ఇట్ ఈజీ. రాత్రికి మాటాడుకుందాం'' అంటూ బయల్దేరారు. తను వెళ్ళాక ఒక కప్పు టీ చేసుకుని పాత ఫోటో ఆల్బం ఒకటి పుచ్చుకుని పేజీలు తిరగేస్తూ సోఫాలో కూర్చున్నా. పెదమావయ్య అంటే నిజానికి మా మావయ్య కాదు. మా అమ్మకి మేనమామ. మా పిన్నిని మావయ్యకిచ్చారు. కానీ పిల్లలందరం ఆయన్ని పెద్దమావయ్య అనటం అలవాటు. వరసగా పుట్టిన పిల్లలెవరూ దక్కని మా పిన్ని దగ్గర, తన పిల్లలని వదిలేస్తూవుండేది మా అమ్మ. ఆ రోజుల్లో టర్న్ నాది మా తమ్ముడిది. అంతకు ముందు పెద మావయ్య దగ్గర మా అక్కయ్య, అన్నయ్య ఉండేవారు. గోదావరి జిల్లాలో చిన్నపల్లెటూళ్ళో మా మావయ్య బాగా పొలం పుట్రా, ఇళ్ళూ వాకిళ్ళూ వున్నవాడు. అంచేత వూరంతా మనదే అన్నట్టు తిరగడం నాకు బాగా వంటబట్టింది. ఆల్బంలో ఉన్న ఫోటోలని చూస్తుండగా మనసు గతంలోకి పరుగెత్తింది.

తొందరగా కానీ పిన్నీ! ఎంతసేపు వేస్తావు జడ. నువ్విలా ఆలస్యం చేస్తే తమ్ముడు ముందెళ్ళి బాదం కాయలన్నీ ఏరేసుకుంటాడు తెలుసా.

ఉండవే పిల్లా! కాస్త కూస్త జుట్టు ఏవైనానా. పూర్తిగా అల్లనీ, లేకపోతే చిక్కు బాగా పడి రేపు జడవేసేటప్పుడు రాగాలు తీస్తావు. - ఇది ఆదివారం పొద్దుటి కార్యక్రమం. పొద్దుటే లేచి పొలంగట్టుకి పరుగెట్టి, తమ్ముడూ నేనూ పోటీలు పడి బాదంకాయలు ఏరి వాటిని రాయితో కొట్టి పప్పు తినటం.

ఇంటికొచ్చి మావయ్య ఒళ్ళో కూర్చుని తమ్ముడి మీద పితూరిలు చెప్పడం. అది విన్నాక పెదమావయ్య ఒరే గుండూ! అక్క మాట వినాలి అంటూ వాడికి న్యాయం చెప్పడం మామూలు.

అమ్మలూ! పెరట్లో కావన్న ఏం చేస్తోందా తెలుసా...

అంటున్న మావయ్య మాట ముగియకుండానే ఒక్క పరుగు తీయడమే. పాలేరు భార్య కావమ్మ మజ్జిగ చిలికి వెన్నముద్ద తీస్తుంది. ఎవరూ చూడకుండా నాకొక గచ్చకాయంత వెన్న చేతిలో పెట్టి, అన్నానికి ముందు ఇలా తింటే అమ్మమ్మగారు కోప్పడతారు. వెన్న పెడితేగాని మీరూరుకోరు. తొందరగా తినెయ్యండమ్మా... అనేది కావన్న.

శనివారం వస్తే చాలు పిన్ని చేసే పూజ ఎందుకో ఏవిటో అర్థం కాక పోయినా రామపరివారం ఫోటో ముందు దణ్ణం పెట్టుకుని శ్రద్ధగా కూర్చునేదాన్ని. పిన్ని గోధుమపిండి పంచదార, నెయ్యి కలిపి ముద్దగా చేసిన ప్రసాదం కోసం. ఈరోజుకి కూడా నేనెప్పుడూ అంతటి కమ్మని వస్తువు తినలేదనిపిస్తుంది.

ఎండాకాలం వస్తే మహా సరదాగా వుండేది. ముందు మామిడికాయలు కొనడం, అందరం కూర్చుని ఆల్చిప్పలతో చెక్కుతీయడం. పాలేళ్ళు కాయల్ని కత్తితో ముక్కలు చెయ్యడం అమ్మమ్మ, పిన్ని ఆవకాయలు, పచ్చళ్ళు పెట్టటం. ఈ హడావుడి మణిగేలోపునే పళ్ళవాళ్ళు కావిళ్ళతో మామిడి పండ్లు అమ్మటం. ఎప్పుడు కొన్నా బుట్టలు బేరంఆడి కొనడమే. భోజనం చేసేటప్పుడు ఆవకాయ అన్నం ఒక ముద్ద తింటేనే మామిడిపండు అని పెదమావయ్య కండిషన్ పెట్టేవారు. కళ్ళూ ముక్కూ ఏకం అవుతుండగా ఒక ముద్ద ఆవకాయన్నం తినే వాళ్ళం నేనూ, తమ్ముడు.

మంచినీళ్ళ కరువున్న ఏడాది... బళ్ళు కట్టుకుని పక్క వూళ్ళనించి నీళ్ళు తెచ్చుకునే వాళ్ళు అందరూ. నేనూ తమ్ముడూ ఎప్పుడూ సిద్ధమే ఇలాంటి పనులకి. అమ్మమ్మ, పిన్ని నేమో చిన్నపిల్లలు వాళ్ళెందుకు కాళ్ళల్లో పడుతూ అనేవారు. పెద మావయ్యేమో మరేం ఫరవాలేదు మీకు అన్నిటికీ కంగారే. ఒరే వెంకడిని కూడా తీసుకెళ్ళండిరా పిల్లలమీద కన్నేసి వుంచడానికి



Telugu Jyothi Special Issue April 08

అనేవారు. బండి మీద తొణికి పోతున్న నీళ్ళ బిందెలని కావలించుకుని పట్టుకోవటంలో వున్న సరదా వర్ణించ తరంగాదు. గట్లవెంబడి పుట్లవెంబడి చెప్పులైనా లేకుండా తిరిగొచ్చిన నాకూ తమ్ముడికి జిల్లేడుపాలు పోసి కాళ్ళలోని ముళ్ళు తీసేవారు మావయ్య.

నాకు ఇంకా బాగా జ్ఞాపకం. నాకోసారి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. బార్లీ గంజి తాగను డోకొస్తుంది అని గొడవ పెడుతున్న నన్ను నీకేం తినాలనుందో చెప్పు అంటే ద్రాక్ష పళ్ళు కావాలని అడిగాను. ఆవూళ్ళో ఎక్కడ దొరుకుతాయి, మర్నాడు పొద్దున్న బస్సుతీసుకుని ఎవరైనా తునో, కాకినాడో వెళ్ళాల్సిందే. పొద్దుట పంపిన మనిషి సాయంత్రం పొద్దుగూకే వేళకి ద్రాక్ష పళ్ళు తెచ్చేదాకా కాలుగాలిన పిల్లిలాగా తిరిగేరు మామావయ్య. ఆ తరవాత ఎన్నేళ్ళైనా, ఎప్పుడుకలిసినా ద్రాక్షపళ్ళు చేతిలో లేకుండా మాత్రం కనబడేవారు కాదు.

తమ్ముడికొక సారి తేలుకుట్టి ఒంటిమీద తెలివిలేకుండా పడిపోయాడు రాత్రంతా. పిన్ని, మావయ్య, అమ్మమ్మ అందరూ తెల్లవార్లు జాగరణే. మర్నాడు వాడికి తెలివి రాగానే గుళ్ళో బోలెడన్ని పూజలు చేయించారు. పిన్ని, మావయ్య చూపించిన ప్రేమాభిమానాలు, జీవితంలో మరుపురాని జ్ఞాపకాలుగా మదిలో ముద్ర వేసుకున్నయి.

తాటాకు మంటలో కాల్చిన జీడి పప్పు, కమ్మటి తేగలు, తాటిముంజలు, కొబ్బరి బోండాలు, తిరణాలలో కొనుక్కుని తిన్న మిఠాయిలు, కరకజ్జాలు, కొత్త ఆవుదూడలు, జున్నుపాలు, దీపావళికి కాల్చుకున్న చిచ్చుబుడ్లు, మతాబులు, సంక్రాంతికి వేసుకున్న చలిమంటలు, అట్లతద్దినాటి ఉయ్యాల ఊపులు, దేవుడి కళ్యాణాలు, గంగానమ్మ జాతర్లు, సముద్రస్నానాలు, అన్నవరం ప్రయాణాలు తలుచుకుంటే... నా బాల్యవైభోగం ముందు కృష్ణదేవరాయల స్వర్ణయుగం కూడా దిగదుడుపే అనిపించింది.

నాకు రావాల్సినంత దుఃఖం ఎందుకు రావటం లేదు? నామనసులో అర్థం కాని ఈ ఆందోళన, చికాకు ఏమిటి? నేను కాలక్రమేణ పెద్దమావయ్యని అంతలా మర్చిపోయానా "వాట్స్ రాంగ్ విత్ మీ'' అంటూ వాపోడంకంటే... మావయ్య నేర్పిన అనురాగం, ఆప్యాయతలతో నిండిన బ్రతుకు పాఠాలని మరికొందరితో పంచుకోవడం సబబనిపించింది. మావయ్య మమతానురాగాలను అద్దం పట్టి చూపించే నా చిన్ననాటి అనుభవాలని నా పిల్లలకి రోజూ చెప్పాలి.

మావయ్య ఎక్కడికీ వెళ్ళలేదు. నా జ్ఞాపకాల్లో మావయ్య ఎప్పుడూ చిరంజీవే... ఈ ఆలోచనతో మనసు కాస్త తేలిక పడినట్టనిపించింది. తమ్ముడికి ఫోన్ చేసి వాడికి ఈ కథలన్నీ గుర్తు చెయ్యాలి.... అనుకుంటూ ఫొటో ఆల్బం మూసాను.


***కాశీనాధుని రాధ***

నివాసం డోవర్, న్యూజెర్సీ.

వృత్తి : పూర్వం ఎప్పుడో ఇండియాలో వుండగా కాలేజీలో తెలుగు పాఠాలు చెప్పడం.

గత పదేళ్ళుగా చేస్తున్న పనులు - వాలంటీర్ చెయ్యడం, పిల్లలకి తెలుగు చెప్పడం, అప్పుడప్పుడు తెలుగు జ్యోతికి కథలు లాంటివి రాయడం.

ఫిలాసఫీ - నవ్విపోదురుగాని నాకేటి సిగ్గు, నా ఇచ్చయే గాక నాకేటి వెరపు.




Telugu Jyothi Special Issue April 08